# ముందుకు నడపండి

తురగా కృష్ణమోహనరావు

నాయికా నాయకుల కదలికల వల్లనే సినీమాలకి చలన చిత్రాలనే పేరు వచ్చిందని ఈ మధ్య నిశ్చయమైంది. వాస్తవానికి దూరంగా కథ నడవడంతో అవి చిత్రాలయ్యాయనీ, నాయికా నాయకులు పాటలు పాడుతూ పరుగెత్తుతూండడం వల్ల చలనచిత్రాలయ్యాయనీ, కొందరు అంటున్నారు. అసలు సినిమాల్లో చేరే ముందు, నాయికా నాయకులు కావలసినవారికి ఒక పరీక్ష ఉంటుందట. తర్వాత ఇంటర్వ్యూ ఉంటుందట. ఈ ఇంటర్వ్యూలో- 'చెట్టు లెక్కగలవా నరహరి. పుట్ట లెక్కగలవా?' వంటి ప్రశ్నలు వేస్తారట. తర్వాత, శిక్షణ కాలంలో ఆయాసం రాకుండా చేగోడీల వంటివి నముల్తూ పాటపాడ్డం; పాటపూర్తయేలోగా మేడమెట్ల నుంచి క్రిందికీ (పైకి కూడా) జారడం, గోడలు దూకడం, గార్డెన్‌లో పరుగెత్తడం, కిటికీల్లోంచీ, స్తంభాలను ఆనుకొనీ విచారంగా చూడ్డం, హీరో నడుపుతూంటే హీరోయిన్, హీరోయిన్ నడుపుతూంటే హీరో- కార్లు, రిక్షాలు, బస్సులు, టేక్సీలు ఎక్కి నిలబడ్డం- ఇవన్నీ నేర్పుతారట! నే నెరుగున్న రచయిత ఒకాయన సినీమాల్లో ఎక్స్‌ట్రా వేషాలు వేస్తూంటాడు అతను చెప్పినదాన్నిబట్టి చూస్తే, సినీమా ఏక్టర్‌కంటే ఐ.ఏ.ఎస్. ఆఫీసరు కావటం సులభం! ఐ.ఏ.ఎస్. పరీక్ష అతి సులువుగా తప్పిన నాకు తెలుసు అదెంత కష్టమో!

నేను చూసిన ఒక సినీమాలో, ఒక పాట ప్రారంభించిన హీరో మొదటి చరణం పాడుతూ, ఎవరో తరుముకొస్తున్నట్టు గార్డెన్‌లోకి పరుగెత్తాడు. అక్కడికి కనీసం మూడు మైళ్ల దూరంలో ఉన్న ఒకడాబా మీద నిలబడిన హీరోయిన్ రెండో చరణం పాడేస్తూ క్రిందికిదిగి, అరడజను చెలికత్తెలను ప్రోగుచేసుకొని, కారెక్కి బయలుదేరింది. నాలుగోమైలురాయి దగ్గర చెరువుగట్టున ఇసుకలో దొర్లుతూ, మూడో చరణం పాడేశాడు హీరో ఈలోగా దగ్గర్లో ఉన్న కొండమీదనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి నాలుగో చరణం పాడేసింది హీరోయిన్. మరెక్కడో- హీరో చెలికాళ్ళూ, హీరోయిన్ చెలికత్తెలూ, కొందరు అడ్డంగా మరి కొందరు నిలువుగా ఊగుతూ తిరుగుతూ మరోచరణం పాడేరు. అంతకుముందు సీనులో పెట్టడం మర్చిపోయినా, అవసరార్థం సీనులోకి హఠాత్తుగా వచ్చిన ఒక కారు హారన్ బంయ్యిమనిపించి, పాడుతూ నవ్వేడు హీరో; నవ్వుతూ, సిగ్గుపడుతూ, గడ్డిపోచ ఒకటి అడ్డంపెట్టుకొని హీరోని చూస్తూ, హీరోయిన్ పాడింది. ఈలోగా పాట ఐపోవడంతో, నాయికానాయకు లిరువురూ, సిగ్గుకి శెలవిచ్చి, చెయ్యి చెయ్యి పట్టుకొని కెమేరాకి దూరంగా వెళ్ళిపోయారు.



నాక్కూడా హీరోయిన్లతో పాటలు పాడుతూ పరుగెత్తడం అంటే ఇష్టం. కాని లావుగా ఉన్నవాళ్ళని హీరోలుగా తీసుకోరుట. హీరోయిన్ కొండమీదనుంచి పరుగెత్తుకురావడం చూస్తేనే నాకు ఆయాసం వచ్చింది. సినీమాల్లో హీరోగా వేషం వేయడానికి మంచి బలం, సౌందర్యం, ధైర్యం, ఆరోగ్యం, ఉత్సాహం కావాలనడంలో సందేహంలేదు. మేడమెట్ల మీదనుంచి జారి, కాలు బెణికిందని ఏడుస్తూ కూచుంటే లాభంలేదు. డైరెక్టరు 'ఛీ పో. అవతలకి ఫో' అంటాడు. పైన చెప్పిన లక్షణాలు అన్నీఉంటే, నటన చేయకపోయినా ఫరవా లేదుట.- మా 'ఎక్స్‌ట్రా' ఫ్రెండు చెప్పాడు.






కొన్ని సినీమాల తర్వాత, నటన అదే చేతా తుందిట. చేతకాకపోతే ఇతను చేసిందే అసలు నటన అని చెప్పవచ్చుట అంద రితో మా ఫ్రెండుకి బస్సుక్యూలో నిలబడి ఉన్నట్టు, నాలుగు సినీమాల్లో నటించిన తర్వాత, ఐదో సినీమాలో బస్సులో సీటు దొరికిందట. కండక్టరుతో మాటాడు తున్నట్టు చిన్న డైలాగుకూడా ఇచ్చారుట. బాత్‌రూమ్ ముందు తువ్వాలు కట్టుకొని నిలబడ్డట్టు. ఇప్పటికి రెండు సినీమాల్లో నటించాట్ట. వచ్చే సినీమాల్లో తప్పక స్నానం చేయగలననే ఆశతో ఉన్నాడు.

'లావుగా ఉన్నా ఫరవాలేదు, కెమేరా మేన్ మనవాడైతే' అన్నాడు మా ఎక్స్‌ట్రా ఫ్రెండు. బండ్లు ఓడలుగాను, ఓడలు బండ్లుగాను చూపించగల శక్తి కెమేరానా థుల కుంటుందిట. సినీమాలో నటించడం చాలా కష్టమని, తెలిసిన వాళ్ళంతా చెప్తు న్నారు.

ఒక సినీమాలో ఖరీదైనచీర కట్టు కున్న నాయిక, ఆ చీరకి నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించాలి. నాయకుడు ఎగిరి గంతేసి వచ్చి మంటలార్చి ఆమె భుజంమీద ఒక చరుపుచరిచి, 'ఛీ! ఇదేమిటి పిచ్చిపిల్లా? తప్పుకాదూ?' అనాలి. తీరా చీర బాగా అంటుకుంటే, ఆరదని నాయిక భయం. మంట మరీ పెద్దద యితే, తన చేతులు కాల్తాయని నాయకుడి భయం ఎలాగూ కాలిపోయే చీర కాబట్టి, చౌకరకం తగలెడితే మంచిదని నిర్మాత అభి ప్రాయం. ఆ చీర అంటుకోడం ఎవరికీ ఇష్టంలేదు రచయితకి తప్ప. మధ్యలో మారిస్తే తన స్క్రిప్టు తగలబడిపోతుందని ఆయన మొహం మాడ్చుకున్నాట్ట. ఆ సీను షూటింగు ప్రారంభం అయింది. ప్రతిసారీ ఆమె ఇంకా చీర అంటుకోకుండానే సినీమా స్టైయిలులో వెక్కడం, హీరో కెమేరా లైట్ల లోకి గెంతి, చీరకొంగు ఆర్పేశాననుకొని ఆమె భుజంమీద తట్టి డైలాగు చెప్పడం, డైరెక్టరు 'కట్' అనడం. చివరికి హీరోకి ఆయాసం వచ్చిందట. హీరోయిన్ భుజం రాయిలా అయిపోయిందట.

కొన్ని కొన్ని సినీమాల్లో, హీరో గుర్రం మీదనుంచి క్రింద పడాలి. మరికొన్ని సినీ మాల్లో దుష్టుడు హీరోను క్రిందపడేసి మీద కూచొని. తల నేలకేసి కొట్టాలి. హీరోదికాని, గుర్రందికాని, దుష్టుడిదికాని నటన దర్శకుడికి నచ్చకపోతే, ఆయన 'కట్' అంటూంటాడు. ఇక- దర్శకుడుగా రికి నచ్చేలోగా, గుర్రానికికాని, దుష్టుడికిగాని కోపంవచ్చిందా? హీరోపని చెప్పఖ్ఖర్లేదు - గోవిందా, గోహోవింద!

సినీమాల్లో నటించడం చాలా ప్రమా దకరం అనడంలో సందేహంలేదు.

---

దేశాంతర సర్కీటు తిరగడంలో ఆస్తి అంతా హారతి కర్పూరం చేసుకున్న వెంచు గారు. ఎల్లానైతేం చివరికి స్వగ్రామం చేరుకుని "లండను" వెళ్ళి దిగుతూన్నట్టు నలుగురి తోటీ ఫరఫరలాడించడం అంబ య్యగారు విని,

అం: తమరు లండన్లో ఉన్నది. ఎన్నాళ్ళూ?

వెం: గ్రేట్ వైల్. చాలా కాలం.

అం: మీరు "హౌస్ ఆఫ్ లార్డ్సు" వీక్షించారూ?

వెం: వాట్! చూడకేం, సాక్షాత్తూ ఒక హౌస్ ఆఫ్ లార్డు గారి ఇంట్లో భోజనం కూడా చేస్తేనే!::

--భమిడిపాటి కామేశ్వరరావు

---

మనలో చాలమంది బస్సుస్టాండు మనుష్యులం. బస్సుస్టాండులవద్ద బస్సులు స్టాండుకావు ఈ రోజుల్లో. స్టాండు అయ్యేది మనుష్యులే. ఈ మనుష్యుల స్టాండువద్ద మనం గంటలతరబడి రెప్ప వేయక చూస్తుంటాం. బస్సు ఆగకుండా వెళ్ళిపోయినవైపు కళ్ళెర్రచేసి చూస్తుంటాం. జీవితంలో మనకు మిగిలిన ఉత్సాహం అంతా, బస్సు సక్రమంగా ఎక్కి గమ్య స్థానం చేరడంలో ఖర్చు ఐపోతుంది రోజూ. మనలో ప్రతివాడికి క్రికెట్ ఆడి సెంచరీలు కొట్టాలనీ, ఎదుటి పక్షం వారినందరినీ వెంటవెంటనే బౌల్ చేసేయాలనీ, టెన్నిస్ ఆడి కృష్ణన్‌ని ఓడించాలనీ, మునిగిపోతున్న ఓడలోంచి నీళ్ళలోకి దూకి ఇతరులను రక్షిం చాలనీ, భగభగ మండుతూన్న మంటల మధ్యనుంచి దూరి చంటిపిల్లలనీ, ఆడవా ళ్ళనీ, ముసలివాళ్ళనీ రక్షించాలనీ ఉంటుంది. ఎందుకో ఈ సంఘటనలు మన జీవితంలో సాధ్యపడవు. నాకు జీవితంలో తటస్థ పడ్డ సాహసోపేతమైన చర్య-ఆగకుండా పోతున్న బస్సు ఎక్కి, పక్కనే పోతున్న ట్రాఫిక్‌లోకి వేలాడ్డం.

కావాలని కోరుకున్నా, మనకి జీవి తంలో తటస్థపడని సాహసాలూ, ప్రమా దాలూ, సినీమాల్లో కనబడతాయ్. ఎంతో ఖర్చుపెట్టి ఎంతో శ్రమకోర్చి, ఎన్నో ప్రమా దాలకులోనై మన కష్టాలను మరిపించి, మనసుకు సుఖం కల్పించే చిత్రాలు తీస్తు న్నారు సినీమావాళ్ళు. మనిషికి నెలకి పది ఇరవై ఖర్చుపెట్టి చూస్తున్నాం మనం. ఇదంతా మంచిదేగాని-సినీమాలన్నీ కలిసి మనల్ని ఎంత ముందుకు తీసుకుపోయా యన్నదే సమస్య.

సర్కస్ గుర్రాలు గిర్రున రౌండ్లుతి రిగి, రకరకాల ఫీట్లుచేసి మనల్ని ఆనంద పరుస్తాయి. రేసుల్లో పరుగెత్తే గుర్రాలు వేగంగా పరుగెత్తి అదృష్టాన్ని తిరగేస్తుం టాయి. జట్కా గుర్రాలు ఈ రెండు రకాల గుర్రాకి సాటిరావుగాని- అవే మనల్ని కొంచెం ముందుకు తీసుకు పోయేవి. సాలీనా కోట్లకొలది రూపాయలు ఖర్చుపెట్టే సినీవాళ్ళుకూడా సమాజాన్నీ, వ్యక్తుల్నీ-కొంచెం ముందుకు తీసుకుపో డానికి ప్రయత్నిస్తే ఎంత బాగుణ్ణు.